సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



వణికిస్తున్న చలి!

జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతుండగా చలి వణికిస్తోంది. ఉదయం 9 వరకూ మంచు కమ్మేస్తుండటంతో జనం వెచ్చదనం కోసం ఉన్ని వస్త్రాలు వాడుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం

33.2°/16.9°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



అధికారులు, రాజకీయ పార్టీ నాయకులతో సమీక్షిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

హిందూపురం టౌన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా రాజకీయ పార్టీల నుంచి అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. స్వచ్ఛ ఓటరు జాబితాకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం ఓటరు జాబితా సవరణకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులు, మార్పులు, చేర్పులు, తొలగింపులు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ, ఓటరు జాబితాకు సంబంధించి అందే ఫారం 6, 7, 8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈవీఎం ప్రదర్శన కేంద్రాన్ని, పట్టణంలోని పలు పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలన్నారు. జేసీ వెంట తహసీల్దార్ స్వర్ణలత, లేపాక్షి, చిలమత్తూరు తహసీల్దార్లు బాబు, నాగరాజు, ఎన్నికల నోడల్ అధికారి, ఏడీ సురేష్, ఎన్నికల విభాగం అధికారులు ఉన్నారు.

5న ధ్రువపత్రాల పరిశీలన

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ అప్రెంటిస్‌షిప్‌కు ఎంపికైన అభ్యర్థులు జనవరి 5 వ తేదీ ఉదయం 9 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో కర్నూలులోని ఆర్టీసీ శిక్షణ కళాశాలలో హాజరు కావాలని జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీఓ) మధుసూదన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్ సీరియల్ నంబర్ 26, 53, 12, 9, 52, 67, 68, 79, 70, 13, 69, 16, 83, 47,105, 45, మోటర్ మెకానిక్‌కు సంబంధించి 22, 23, ఎలక్ట్రీషియన్ 18, 85, 4, వెల్డర్ 01 సీరియల్ నంబర్ అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరంతా పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్, జనన, కుల ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ ఖాతా పుస్తకంతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలన్నారు. ధ్రువీకరణ పత్రాలన్నీ మూడు సెట్లుగా జిరాక్సులు చేయించి 5న జరిగే ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు.

గాలికుంటు నివారణకు టీకా



జానకంపల్లిలో పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు వేస్తున్న పశువైద్యుడు

పుట్టపర్తి: జిల్లాలోని రైతులు తమ పాడి పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శుభదాస్ సూచించారు. మంగళవారం ఆయన ధర్మవరం ఉప సంచాలకులు చంద్రశేఖర్ తదితరులతో కలిసి బుక్కపట్నం మండలం జానకంపల్లిలో పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శుభదాస్ మాట్లాడుతూ, జిల్లాలో గాలికుంటు టీకాలు వేసే కార్యక్రమం నెలరోజులపాటు కొనసాగుతుందన్నారు. 4 నెలల వయస్సు పైబడిన ప్రతి పశువుకూ టీకా వేయించాలని సూచించారు.

జయహో బీసీ



బీసీలకు ప్రాధాన్యం.. మైనార్టీకి సముచిత స్థానం

- ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలూ బీసీలకే
- అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్తగా శంకరనారాయణ, హిందూపురం పార్లమెంటు సమన్వయకర్తగా జోలదరాశి శాంత
- పెనుకొండకు ఉషశ్రీ చరణ్, కళ్యాణదుర్గానికి తలారి రంగయ్య, కదిరికి మక్బూల్ అహ్మద్ సమన్వయకర్తలుగా నియామకం
- అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు



మాలగుండ్ల శంకరనారాయణ



జోలదరాశి శాంత



బీఎస్ మక్బూల్ అహ్మద్



ఉషశ్రీ చరణ్



తలారి రంగయ్య

అనంతపురం ఎడ్యుకేషన్/కదిరి: 'నా బీసీ, నా మైనార్టీ, నా ఎస్సీ' అంటూ బడుగులకు పెద్దపీట వేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల వేళ పార్టీ సమన్వయకర్తలుగా ఆయా వర్గాలకు ప్రాధాన్యమిచ్చారు. మిగతా పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటే.. వైఎస్ జగన్ మాత్రం అక్కున చేర్చుకుని రాజకీయ ప్రాధాన్యత కల్పించారు. దశాబ్దాలుగా రాజ్యాధికారం కోసం గళం విప్పుతున్న అణగారిన వర్గాలను ఆ దిశగా నడిపిస్తున్నారు. తాజాగా పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు నియమించిన సమన్వయకర్తల జాబితాను చూస్తే ఇదే విషయం స్పష్టమవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా మూడు ఎంపీ, 24 అసెంబ్లీ స్థానాలకు సమన్వయకర్తలను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జాబితాలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలు, మూడు ఎమ్మెల్యే స్థానాలు ఉన్నాయి. సామాజిక సమీకరణల నేపథ్యంలో కొందరు సమన్వయకర్తలు మారారు. ఏది ఏమైనా జనాభాకు అనుగుణంగా సింహభాగం ఉన్న బీసీలకు పెద్దపీట వేశారు. మైనార్టీలకూ సముచిత ప్రాధాన్యత కల్పించారు. సమన్వయకర్తల నియామకంలో సామాజిక పరంగా పెద్దపీట వేయడంతో అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను అనంతపురం పార్లమెంటు సమన్వయకర్తగా నియమించారు. అలాగే హిందూపురం పార్లమెంటు సమన్వయకర్తగా మాజీ ఎంపీ జోలదరాశి శాంతను నియమించారు. గుంతకల్లుకు చెందిన శాంత 2009లో బళ్లారి ఎంపీగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో హిందూపురం ఎంపీ అభ్యర్థిగా కురుబ సామాజిక వర్గానికి చెందిన గోరంట్ల మాధవ్‌కు, అనంతపురం ఎంపీ అభ్యర్థిగా బోయ కులానికి చెందిన తలారి రంగయ్యకు అవకాశం ఇవ్వగా.. ఈసారి అనంతపురం పార్లమెంటు స్థానాన్ని కురుబ, హిందూపురం పార్లమెంటు స్థానాన్ని బోయ కులస్తులకు కేటాయించడం గమనార్హం.
- పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా మంత్రి ఉషశ్రీచరణ్‌ను నియమించారు. కురుబ సామాజిక వర్గానికి చెందిన ఈమె ప్రస్తుతం కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక అనంతపురం ఎంపీగా ఉన్న తలారి రంగయ్యను కళ్యాణదుర్గం సమన్వయకర్తగా నియమించారు. అలాగే కదిరి నియోజకవర్గ సమన్వయకర్తగా ముస్లిం మైనార్టీకి చెందిన బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను నియమించారు. ఈ సీటు ముస్లింలకు కేటాయించడంతో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఆ వర్గం నేతలు, ప్రజలు వైఎస్సార్‌సీపీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- 6న జేఎన్‌టీయూ స్నాతకోత్సవానికి హాజరు
- అదే రోజు వికసిత్ భారత్ ముగింపు కార్యక్రమానికి సైతం..



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. గవర్నర్ పర్యటన అంశంపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరో తేదీన గవర్నర్ జిల్లాకు విచ్చేస్తారన్నారు. ఉదయం జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన స్నాతకోత్సవంలో పాల్గొంటారన్నారు. సాయంత్రం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముగింపు కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఏర్పాట్లలో చిన్నపాటి పొరపాట్లకూ తావివ్వకూడదన్నారు. పర్యటన ఏర్పాట్లకు సంబంధించి అప్పగించిన బాధ్యతలను అధికారులు జాగ్రత్తగా నిర్వర్తించాలన్నారు. ముఖ్యంగా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఏఎస్పీ (అడ్మిన్) విజయభాస్కర్‌రెడ్డి, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, డీటీసీ వీర్రాజు, అర్బన్ డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, రూరల్ డీఎస్పీ శివారెడ్డి, సీపీఓ అశోక్‌కుమార్ రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, పంచాయతీరాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు నరసింహారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు, పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సిక్కిం.. సంస్కృతి వెల్లివిరిసెన్



నృత్య ప్రదర్శనలోని ఓ ఘట్టం





ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన సిక్కిం సత్యసాయి భక్తులు తమ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నిర్వహించిన కార్యక్రమాలు భక్తులను మైమరపించాయి. మంగళవారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సిక్కిం భక్తులు 'కొసెలీ నృత్య నాటిక ' ప్రదర్శించారు. వినాయకుడిని స్మరిస్తూ... సత్యసాయి బోధనలను చాటుతూ చక్కటి నృత్య భంగిమలతో భక్తిగీతాలు ఆలపిస్తూ భక్తులను మంత్ర ముగ్ధులను చేశారు. సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఆరోగ్య సురక్ష.. జన రక్ష



బుక్కపట్నం -2 సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది



ఆరోగ్య సురక్ష కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

- తొలిరోజు 17 కేంద్రాల్లో వైద్య శిబిరాలు
- 3,350 మందికి ఓపీ సేవలు

ప్రశాంతి నిలయం: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన లభిస్తోంది. రెండో విడత సురక్ష కార్యక్రమం మంగళవారం జిల్లాలో ప్రారంభమైంది. తొలిరోజు 17 రూరల్ కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. 34 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 17 మంది పీహెచ్‌సీల వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఆయా శిబిరాల ద్వారా 3,350 మందికి ఓపీ సేవలు అందించారు. 25 మందిని శస్త్ర చికిత్సల కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. 189 మందికి కంటి సమస్యలపై స్క్రీనింగ్ చేసి ఆరుగురిని క్యాటరాక్ట్ చికిత్స కోసం రెఫర్ చేశారు. మరో 99 మందికి కంటి అద్దాలను అందజేశారు. నల్లచెరువులో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి సందర్శించి రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు.

పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

పెనుకొండ రూరల్: నిరుపేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శద్ధ చూపుతోందని, అందులో భాగంగానే 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాల ద్వారా గ్రామగ్రామానా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తోందని ఆరోగ్య సురక్ష నోడల్ ఆఫీసర్ శివశంకర్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన మునిమడుగు గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని తనిఖీ చేశారు. సురక్ష స్టాల్‌ను పరిశీలించి వైద్యులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైందన్నారు. సురక్ష వైద్య శిబిరాల ద్వారా 7 రకాల పరీక్షలు నిర్వహించడంతో పాటు 92 రకాల మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేకంగా వైద్యులను శిబిరాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గ్రామీణులకు సురక్ష శిబిరాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు నాయక్, సచివాలయ సిబ్బంది, వైద్య,ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఆఖరు అవకాశం

- 5వ తేదీలోపు విధుల్లో చేరాల్సిందే
- లేకపోతే శాఖా పరమైన చర్యలు తప్పవు

పుట్టపర్తి అర్బన్: సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ప్రభుత్వం చివరి అవకాశం ఇచ్చింది. ఈనెల 5వ తేదీలోపు అందరూ విధుల్లో చేరాలని సూచించింది. 11 డిమాండ్లతో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు డిసెంబర్ 12 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం, ఐసీడీఎస్, ఆర్థిక శాఖలతో పలుమార్లు జరిపిన చర్చల్లో కొన్ని డిమాండ్లకు ప్రభుత్వం సానుకూలంగా అంగీకరించడంతో పాటు ఆ వెంటనే జీఓలు కూడా ఇచ్చింది. దీన్ని గుర్తించి అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు వెంటనే సమ్మెను విరమించాలని కలెక్టర్ అరుణ్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. అంగన్‌వాడీల సమ్మెతో గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలకు పౌష్టికాహార పంపిణీ నిలిచిపోయే ప్రమాదం ఉన్నందున వెంటనే సమ్మెను విరమించాలని కోరారు.

అర్థం చేసుకోండి..సాయం మరవకండి..

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కార్యకర్తల జీతాలను రూ.11,500, సహాయకులు, మినీ కార్యకర్తల జీతాలను రూ.7,000లకు పెంచిందని కలెక్టర్ గుర్తుచేశారు. అలాగే పలు డిమాండ్లను అంగీకరించడంతో పాటు జీఓలు సైతం జారీ చేసిందన్నారు. కేంద్రాల నిర్వహణ చార్జీలు విడుదల చేయడంతో పాటు మంచి పనితీరు కనబర్చిన సిబ్బందికి ప్రోత్సాహకంగా నెలకు రూ.500 అందజేస్తోందన్నారు. కార్యకర్తలకు గ్రేడ్-2 సూపర్‌వైజర్లుగా ప్రమోషన్లు ఇచ్చిందన్నారు. నవరత్నాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు జగనన్న విద్యాదీవెన, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, ఆరోగ్యశ్రీ తదితర పథకాలను వర్తింపజేసిందన్నారు. అంతేకాకుండా స్మార్ట్ ఫోన్లు ఇవ్వడంతో పాటు ప్రతి నెలా వన్ జీబీ డేటాను ఇస్తోందన్నారు. ఈ ఏడాది నుంచి సిబ్బందికి ప్రమాద బీమా గా రూ.2 లక్షల వరకూ చెల్లిస్తోందన్నారు. నాలుగు జతల యూనిఫాం సైతం అందజేసిందన్నారు. అలాగే 'నాడు-నేడు' ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో మంచి వసతులు కల్పించిందన్నారు. వీటన్నింటినీ అంగన్‌వాడీలు గుర్తించాలని కలెక్టర్ కోరారు.

తాజా చర్చల్లోనూ ఎన్నో వాటికి ఆమోదం..

తాజాగా జరిగిన చర్చల్లోనూ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు గరిష్ట వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సర్వీసు చివరి నాటికి అంగన్‌వాడీ కార్యకర్తకు ఇప్పుడున్న బెనిఫిట్‌ను రూ. 50 వేల నుంచి రూ.లక్షకు, సహాయకుల సర్వీసు బెనిఫిట్ రూ.20 వేల నుంచి రూ.40 వేలకు పెంచిందని కలెక్టర్ తెలిపారు. సహాయకులు, కార్యకర్తల పదోన్నతి వయో పరిమితిని కూడా 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచిందన్నారు. కార్యకర్తలకు టీఏ, డీఏలను ప్రభుత్వ నిధుల నుంచి విడుదల చేసేందుకు కూడా అంగీకరించింది. అర్హత ఉన్న మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్‌కు మార్చేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. వీటన్నింటినీ గుర్తించి అంగన్‌వాడీలు విధుల్లోకి హాజరుకావాలని కలెక్టర్ కోరారు. జనవరి 5వ తేదీలోపు సమ్మె విరమించక పోతే ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



కదిరిలో కరోనా కొత్త వేరియంట్ పేషెంట్ల కోసం సిద్ధం చేసిన ప్రత్యేక వార్డు

'కోవిడ్'పై అప్రమత్తం

- కరోనా కొత్త వేరియంట్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం
- జిల్లాలోని ప్రతి ఆస్పత్రిలో ప్రత్యేక కోవిడ్ వార్డు
- అందుబాటులో పడకలు, వెంటిలేటర్లతో పాటు ఆక్సిజన్
- ప్రతి ఆస్పత్రిలోనూ ఆర్‌టీపీసీఆర్, ర్యాపిడ్ కిట్లు

కదిరి: దేశంలోని పలు రాష్ట్రాల్లో కరోనా కొత్త వేరియంట్ జేఎన్-1 కేసులు నమోదవుతున్న తరుణంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అప్రమత్తమైంది. కేరళ, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ ఇలా పలు రాష్ట్రాల్లో ఇప్పటికే పదుల సంఖ్యలో కరోనా కొత్త వేరియంట్ కేసులు బయటపడ్డాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులను అప్రమత్తం చేసింది. గత రెండు విడతల్లోనూ కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్న రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు కూడా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను భాగస్వామ్యం చేస్తూ జేఎన్-1పై యుద్ధానికి సిద్ధంగా ఉంది.

సర్వం సిద్ధం..

తాజాగా కోవిడ్ కొత్త వేరియంట్ జేఎన్-1పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పలుమార్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రితో పాటు పలువురు ఉన్నతాధికారులతో ఇటీవలే ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించారు. అన్ని శాఖలనూ అప్రమత్తం చేశారు. అయితే జేఎన్-1తో ప్రజలెవ్వరూ భయపడాల్సిన పని లేదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఎలాంటి పరిస్థితిని ఎదుర్కోడానికైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ప్రతి ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక వార్డుతో పాటు ఆర్‌టీపీసీఆర్ పరీక్షల కోసం కిట్లు సిద్ధం చేశామని వెల్లడించారు. అలాగే గ్రామ/వార్డు సచివాలయాల్లో 10 చొప్పున ర్యాపిడ్ కిట్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. కోవిడ్ లక్షణాలున్న వారు వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

వదంతులు నమ్మకండి..

జిల్లా వ్యాప్తంగా కరోనా కొత్త వేరియంట్ జేఎన్-1 కేసు ఇప్పటి దాకా ఒక్కటి కూడా నమోదు కాలేదని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. కొందరు కావాలనే కరోనా పేరుతో వదంతులు సృష్టిస్తున్నారని, వాటిని ఎవ్వరూ నమ్మవద్దని చెబుతున్నారు. అలాగని తాము కోవిడ్‌ను నిర్లక్ష్యం చేయడం లేదని, ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేసుకొని అప్రమత్తంగా ఉన్నామని వెల్లడించారు.

జాగ్రత్తలు అవసరమే..

ఇప్పుడున్న పరిస్థితుల్లో వైరస్ సోకకుండా జాగ్రత్తలు పాటించడం కష్టమేమీ కాదు. వయసు పైబడిన వారు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు, చిన్న పిల్లలు, మరీ ముఖ్యంగా రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవారు కచ్చితంగా మాస్కులు ధరించడం మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కోవిడ్ బారిన పడితే తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, జలుబు, ముక్కు కారడం, గొంతునొప్పి, వాసన, రుచిని కోల్పోవడం, తలనొప్పి, కొందరిలో కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, మరికొందరిలో శ్వాసకోశ సమస్యలు వస్తాయని, వీటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

పరీక్షలు చేస్తున్నాం..



కరోనా కొత్త వేరియంట్ జేఎన్-1 నిర్ధారణ కోసం జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేయిస్తున్నాం. ఇప్పటిదాకా జిల్లాలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. అయినప్పటికీ కొత్త వేరియంట్‌ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి అనుమానం వచ్చినా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

– ఎస్వీ కృష్ణారెడ్డి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ అరుణ్‌బాబు ఆవిష్కరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సర్వీసెస్ సంబంధిత సమాచారాన్ని సమగ్రంగా ముద్రించినందుకు అధికారులను అభినందించారు. రెవెన్యూ ఉద్యోగులు అందరికీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధునాయక్, జిల్లా సెక్రటరీ మైనుద్దీన్, ట్రెజరర్ దేవేంద్రనాయక్, వైస్ ప్రెసిడెంట్ స్వాతి, అసోసియేట్ ప్రెసిడెంట్ నరసింహులు, జాయింట సెక్రెటరీలు పవన్, రామక్రిష్ణ తదితరులు ఉన్నారు.

వెలుగుమాకులపల్లిలో సబ్ కలెక్టర్ విచారణ

సోమందేపల్లి: గిరిజనుల మృతదేహాలను గ్రామంలోకి అనుమతించకపోవడంపై మండలంలోని వెలుగుమాకులపల్లిలో మంగళవారం సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ విచారణ చేపట్టారు. తమ తండాలో 50 కుటుంబాలు ఉన్నాయని, ఎవరైనా ఇతర ప్రాంతాల్లో మరణించినపుడు ఖననం కోసం తీసుకువస్తే సరిహద్దులోని వెలుగమాకుల పల్లివాసులు అనుమతించడం లేదంటూ ఇటీవల వలంటీర్ శ్రీకాంత్ నాయక్ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే గ్రామంలో సబ్ కలెక్టర్ విచారణ చేపట్టారు. త్వరలో గ్రామ సభ నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఎస్ఐ విజయ్ కుమార్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఈఓఆర్డీ నాగరాజురావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గార్లదిన్నె: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన ధనుంజయ (36)కు భార్య సుజాత, ఓ కుమారుడు ఉన్నారు. గతంలో వ్యవసాయ పనులతో జీవనం సాగించేవారు. పంట నష్టాలతో కుదేలైన ఆయన జీవనోపాధి కోసం ఆటో డ్రైవర్‌గా మారాడు. ఇటీవల ఆటో కూడా మరమ్మతుకు గురైంది. దీంతో అప్పులు తీర్చే మార్గం కానరాక సోమవారం రాత్రి ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం వేకువజామున ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యుల సమాచారం మేరకు ఎస్ఐ సాగర్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వణికిస్తున్న చలి!

అసలే శీతాకాలం.. జిల్లా వ్యాప్తంగా దట్టమైన పొగమంచు కమ్ముకుంటోంది. చలిపులి పంజా విసురుతోంది. ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో ఉదయం 10 గంటలైనా రోడ్లపై మంచు తగ్గడం లేదు. తెల్లవారినా జిల్లాలోని హిందూపురం, పుట్టపర్తి, మడకశిర, కదిరి ప్రాంతాల్లోని జాతీయ రహదారులపై వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని ప్రయాణం సాగించాల్సి వస్తోంది. రాత్రి ఉష్ణోగ్రతలు 15 నుంచి 14 డిగ్రీలకు పడిపోతుండడంతో చలి తీవ్రతను తట్టుకోలేక వృద్ధులు, చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా చలికి, పొగమంచుకి వీడ్కోలు చెప్పి వెచ్చదనానికి స్వాగతం పలికే స్వెటర్లు, దుప్పట్లకు డిమాండ్ పెరిగింది.

- కమ్మేస్తున్న మంచుతెరలు
- ఉదయం 10 గంటలైనా తొలగని పొగమంచు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- చలి తీవ్రత కారణంగా ప్రజలకు ఇక్కట్లు
- పుంజుకున్న స్వెట్టర్లు, దుప్పట్ల వ్యాపారం



అమ్మకానికి ఉంచిన దుప్పట్లు



44వ జాతీయరహదారిపై కొడికొండ చెక్‌పోస్టు వద్ద కమ్ముకున్న పొగమంచు

పుట్టపర్తి అర్బన్: గత 15 రోజులుగా జిల్లాను చలి పులి వణికిస్తోంది. వృద్ధులతో పాటు ఉదయాన్నే పనులకు వెళ్లే రైతులు, పారిశుధ్య కార్మికులు, యువకులు సైతం చలికి వణికిపోతున్నారు. రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతోంది. జిల్లాలోని అమడగూరు, కదిరి, నల్లచెరువు, మడకశిర, గోరంట్ల, పుట్టపర్తి తదితర మండలాల్లో ఉదయం 10 గంటలైనా ప్రజలు చలికి వణికి పోతున్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాలను దట్టమైన పొగ మంచు కప్పేస్తోంది. ఈసారి ఆశించినంత మేర వర్షాలు లేకపోయినా భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో వాతావరణంలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి.

ఉన్ని దుస్తులు, దుప్పట్లకు పెరిగిన డిమాండ్

జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రతను తట్టుకునేందుకు ఉన్ని దుస్తులు, దుప్పట్లకు భారీగా డిమాండ్ నెలకొంది. దీంతో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, రాజస్తాన్ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు జిల్లాలోని పలు పట్టణాల్లో తమ దుకాణాలు తెరిచారు. ఆరు నెలల క్రితమే ప్రారంభించిన విక్రయాలు మందకొడిగా సాగుతూ వచ్చాయి. తాజాగా పది రోజులుగా కొనుగోలుదారులు పెరగడంతో దిగుమతులూ పెరిగాయి. పలు పట్టణాల్లో వలస వ్యాపారులు ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేసుకుని విక్రయాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే ద్విచక్ర వాహనాలపై గ్రామీణ ప్రాంతాలనూ చుట్టేస్తూ తమ వ్యాపారాలను విస్తరించుకుంటున్నారు.

ఆధునికతకు పెద్ద పీట

గతంలో చాలా మంది దుప్పట్ల బదులు పాత చీరలను మందంగా కుట్టి బొంతలు తయారు చేసుకునేవారు. అలాగే స్వెటర్లను సైతం నాణ్యమైన ఉన్నితో స్వయంగా అల్లుకునేవారు. పొలాల వద్ద కాపలాకు వెళ్లే రైతులు ప్రత్యేకంగా తయారు చేసిన కంబళ్లను తమతో పాటు తీసుకెళ్లేవారు. ఆధునిక పోకడల కారణంగా ప్రస్తుతం బొంతలు కనిపించడం లేదు. కంబళ్ల ధర ఆకాశాన్నంటుతున్నాయి. దీనికి తోడు రంగు రంగుల ఆకర్షణీయమైన దుప్పట్లు, జర్కిన్లు, రెయిన్‌కోట్‌లు మార్కెట్‌లో తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చాయి. దీంతో చాలా మంది ఆధునికంగా ఉన్న వాటినే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీటిలోనూ ఉన్నితో చేసిన వాటికి మంచి గిరాకీ ఉంది. మాల్స్‌లో కన్నా తక్కువ ధరకు వలస వ్యాపారులు విక్రయిస్తుండడంతో ప్రజలు భారీగా కొనుగోళ్లు సాగిస్తున్నారు. నాణ్యతను బట్టి దుప్పట్లు రూ.400 నుంచి రూ.2 వేల వరకూ అందుబాటులో ఉన్నాయి. అలాగే జర్కిన్‌లూ కనిష్ఠంగా రూ.500తో విక్రయాలను సాగిస్తున్నారు.

'సమగ్ర' అక్రమాలపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్షలో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ చేపట్టనున్నట్లు ఏపీసీ వరప్రసాదరావు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సమగ్రశిక్ష ఇంజినీరింగ్ విభాగంలో చోటుచేసుకున్న అక్రమాలపై మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. గోరంట్ల కేజీబీవీలో జరిగిన పనులకు, బిల్లుల డ్రా అంశంపై అక్కడి సమగ్ర శిక్ష ఏపీసీ మీనాక్షి స్పందించి విచారణకు ఆదేశించారు. ఎస్ఎంసీ అనుమతులు లేకుండా పనులెలా చేశారని ఈఈ శంకరయ్యను అడిగారు. ఒకే పనిని మూడు భాగాలుగా విడగొట్టి చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. బిల్లులు చెల్లింపుల్లో నిబంధనలు పాటించలేదనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బుక్కరాయసముద్రం కేజీబీవీలో చేసిన పనులకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా సొమ్మును ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతాలో జమ చేయడంపై సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు విచారణ చేపట్టారు. ఎస్ఎంసీ ద్వారా ఈ బిల్లు చెల్లించలేదని విచారణలో బీకేఎస్ కేజీబీవీ ఎస్ఓ స్పష్టం చేసినట్లు సమాచారం. ఇంజినీరింగ్ అధికారులను విచారణ చేసిన అనంతరం నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేస్తామని ఏపీసీ వెల్లడించారు.

ఆడుతూ.. ప్రతిభ చాటుతూ

- జిల్లావ్యాప్తంగా 'ఆడుదాం ఆంధ్రా' సందడి
- 1.50 లక్షల మందికి పైగా యువత భాగస్వామ్యం



'ఆడుదాం ఆంధ్రా'లో భాగంగా కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు (ఫైల్)

పుట్టపర్తి: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. గ్రామ సచివాలయాల పరిధిలో గత నెల 15న క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారు. మండల స్థాయి పోటీలు 10 నుంచి ఈ నెల 23వ తేదీ వరకూ సాగనున్నాయి. అనంతరం నియోజకవర్గ స్థాయి పోటీలు ఈ నెల 24 నుంచి 30 వరకూ, జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 10 వరకూ జరగనున్నాయి.

రికార్డు స్థాయిలో భాగస్వామ్యం..

దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సీఎం జగన్ శ్రీకారం చుట్టిన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొంటున్నారు. 502 క్రీడా మైదానాల్లో పోటీలు సాగుతున్నాయి. జిల్లాలో 1.50 లక్షల మందికి పైగా క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకుని, భాగస్వాములయ్యారు. 62,016 మందికి ప్రభుత్వం టీ షర్టులు, ట్రోఫీలు, ఇతర క్రీడా సామాగ్రి అందజేసింది. నిష్పక్షపాతంగా పోటీల నిర్వహణకు 5,440 మంది వలంటీర్లు, 2,160 మంది అంపైర్లు, 350 మంది పీడీలు,పీఈటీలను నియమించింది.

మనస్ఫూర్తిగా అభినందనలు



'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల ద్వారా గ్రామీణ యువతకు మంచి అవకాశం లభించింది. ఎంతో మంది పోటీల్లో పాల్గొంటున్నారు. ఉచితంగా క్రీడా సామగ్రి అందించారు. మైదానాల్లో అన్ని వసతులు కల్పించారు. ఎంతో గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. ఆయనకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నా.

– జగదీశ్, కబడ్డీ క్రీడాకారుడు

అద్భుతమైన కార్యక్రమం



గ్రామీణ క్రీడాకారులకు 'ఆడుదాం ఆంధ్రా' వరంలాంటిది. ప్రభుత్వమే క్రీడా పోటీలు నిర్వహించడం గర్వకారణం. దేశంలోనే ఎక్కడా లేని విధంగా యువతీ యువకులకు గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు వివిధ పోటీలు నిర్వహించటం సంతోషంగా ఉంది. మాలాంటి క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయటానికి సీఎం జగన్ తలపెట్టిన ఈ కార్యక్రమం అద్భుతం.

– షౌకత్ వలీ, వాలీబాల్ క్రీడాకారుడు

అనూహ్య స్పందన



ఎవరూ ఊహించని విధంగా 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు ముందుకు వస్తున్నారు. జిల్లాలో 1,56,300 మంది నమోదు చేసుకున్నారు. తొలి దశ పోటీలకు 95 శాతానికి పైగా హాజరయ్యారు.

– ఉదయ్ భాస్కర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

12న జిల్లాస్థాయి యోగా పోటీలు



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: వివేకానంద జయంతి సందర్భంగా అనంతపురం నగరంలో ఈనెల 12న జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశోక్‌నగర్‌లో ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 9 నుంచి 18 సంవత్సరాల బాలబాలికలు పాల్గొనవచ్చన్నారు. 18 నుంచి 55 సంవత్సరాలలోపు వారు కచ్చితంగా 10 యోగాసనాలు వేయాల్సి ఉంటుందన్నారు. రూ.100 చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 9396570362, 8074145733 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ నరసింహులు, సభ్యులు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

జనవాక్కు

పంటల సాగు సులువైంది



నాకు 1.50 ఎకరాల పొలం ఉంది. గతంలో పంట పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించేవాళ్లం. అధిక వడ్డీలు చెల్లించుకోలేక పంటను నష్టాలకే అమ్ముకోవాల్సి వచ్చేది. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీజన్ ఆరంభంలోనే రైతు భరోసా కింద నా బ్యాంక్ ఖాతాలోకి డబ్బు జమ చేస్తోంది. ఈ డబ్బును పెట్టుబడిగా పెట్టి పంట సాగు చేపట్టసాగాను. అప్పుల బాధ తప్పింది. పంటకు గిట్టుబాటు ధర కూడా లభ్యమవుతోంది. సీఎం వైఎస్ జగన్ రైతు పక్షపాతి అని చెప్పడానికి ఇదే నిదర్శనం. మళ్లీ ఆయనే సీఎం కావాలని కోరుకుంటున్నా. – చిరంజీవి రైతు, తురుకువాండ్లు, మడకశిర మండలం

మాలాంటి పేదలకు వరం



వైఎస్ జగనన్న సీఎంగా ఉండడం మాలాంటి పేదలకు ఓ వరం. అమ్మఒడి పథకం వర్తించడంతో నా ఇద్దరు పిల్లలు బడికి సక్రమంగా వెళ్లి చదువుకుంటున్నారు. గత ప్రభుత్వంలో సరైన యూనిఫాం, పుస్తకాల కోసం నానా ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడా పరిస్థితి లేదు. చదువుకునే పిల్లల అన్ని రకాల అవసరాలు మాకంటే ఎంతో శ్రద్ధగా తీరుస్తున్నారు. ఆయనకు ఎంతో రుణపడి ఉన్నాం. మళ్లీ జగనన్నే సీఎం కావాలి.

– గుడిసే సుజాత, దాడితోట, తాడిమర్రి

పాఠశాలల రూపురేఖలు మారాయి



గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. అదనపు గదులు, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణాలతో పాటు విద్యుత్, తాగునీటి వసతులు కల్పించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. నాణ్యమైన పౌష్టికాహారాన్ని మధ్యాహ్న భోజనం కింద అందజేస్తున్నారు. జగనన్న విద్యాకానుక పేరుతో బడి ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, నాణ్యమైన యూనిఫాం దుస్తులు. బూట్లు, బెల్టులు, బ్యాగ్‌లను అందజేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలోనే ప్రభుత్వ బడులు ఎంతో అభివృద్ధి చెందాయి.

– విశ్వనాథరెడ్డి, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ మండలం

పథకాలతో ఆదుకుంటున్నారు



ప్రభుత్వ సంక్షేమ పథకాలు మా కుటుంబ అభ్యున్నతికి దోహదపడతున్నాయి. నాకు కాలు సక్రమంగా లేదు. దివ్యాంగ పింఛన్ రూ.3,000 అందుతోంది. భూమి లేకపోవడంతో నా భర్త వన్నూరస్వామి భూమిని కౌలుకు చేస్తున్నాడు. ఆయనకు కౌలు రైతు కార్డు ద్వారా రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందుతోంది. వైఎస్సార్ చేయూత ద్వారా రూ.18,750 చొప్పున ప్రభుత్వం నాకు అందిస్తోంది. నిరుపేద కుటుంబాల అభ్యున్నతికి దోహదపడే సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. మళ్లీ ఆయన సీఎంగా కావాలని కుటుంబం మొత్తం కోరుకుంటున్నాం. – లక్ష్మీదేవి, శీర్పి గ్రామం, బెళుగుప్ప మండలం

బాలుడిని మింగిన నీటి కుంట



జస్విత్ మృతదేహం

గుడిబండ: నీటి కుంటలో పడి మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. మండల పరిధిలోని ముతుకూరు గ్రామంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... ముతుకూరుకు చెందిన మల్లికార్జునచారి, చంద్రకళ దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు జస్విత్ (3) సంతానం. భార్యాభర్తలిద్దరూ కర్ణాటకలో ఉన్న దొడ్డబళ్లాపురంలో కూలి పనులకెళ్తూ అక్కడే నివసిస్తున్నారు. జస్విత్ గ్రామంలోని అవ్వాతాతలతో కలిసి ఉండేవాడు. మంగళవారం ఉదయం ఆటలు ఆడుకుంటూ సమీపంలోని నీటి కుంటలో పడ్డాడు. గుర్తించిన స్థానికులు హుటాహుటిన మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుమారుడి మృతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేశారు.


ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య



గాయత్రి మృతదేహం

పుట్టపర్తి టౌన్: ఉరేసుకుని పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బీడుపల్లిలో జరిగింది. సీఐ కొండారెడ్డి తెలిపిన మేరకు.. పుట్టపర్తి మున్సిపాలిటీ 17వ వార్డు బీడుపల్లి గ్రామానికి చెందిన చాకలి కళావతికి ముగ్గురు కుమార్తెలు సంతానం. చిన్న కుమార్తె గాయత్రి (15) బీడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. మిగిలిన ఇద్దరిలో ఒకరు ఉద్యోగానికి వెళ్తుండగా, మరో యువతి ఓ కళాశాలలో చదువుతోంది. మంగళవారం తమ పనుల నిమిత్తం కళావతి, ఇద్దరు కుమార్తెలు ఇంటి నుంచి వెళ్లారు. గాయత్రి పాఠశాలకు వెళ్లలేదు. మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో కళావతి ఇంటికి రాగా, గాయత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరికి వేలాడుతున్న స్థితిలో కనిపించింది. ఈ హఠాత్పరిణామంతో తల్లి కన్నీరుమున్నీరుమైంది. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ధర్మవరం: ధర్మవరం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-3 పక్కన మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడని రైల్వే ఎస్ఐ గోపికుమార్ తెలిపారు. 28 నుంచి 30 సంవత్సరాలు వయసు ఉన్న వ్యక్తి వైట్ కలర్ చొక్కా, బ్లూకలర్ ప్యాంట్, బ్రౌన్ కలర్ డ్రాయర్ ధరించి ఉన్నాడన్నారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తుపడితే రైల్వే ఎస్ఐ 9440627640, 9440552808 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.

బీటెక్ మూడో సెమిస్టర్ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాలలో గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన బీటెక్ రెండో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (మూడో సెమిస్టర్) రెగ్యులర్ ఫలితాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ మంగళవారం విడుదల చేశారు. పరీక్షలు డిసెంబర్ 19న ముగిశాయి. కేవలం 13 రోజుల వ్యవధిలోనే ఫలితాలు విడుదల చేయడానికి కృషి చేసిన డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి. విష్ణువర్ధన్ , డాక్టర్ డి. లలిత కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ కె.ఎఫ్.భారతి, ప్రొఫెసర్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ రామశేఖర్ రెడ్డి, కె.కళ్యాణిరాధ బి.అజిత తదితరులు పాల్గొన్నారు.

చిదంబర రావుకు అవార్డు



చిదంబరరావుకు అవార్డు అందజేస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలుబొమ్మల కళాకారుడు ఎస్. చిదంబర రావు ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ అకాడమీ అవార్డు అందుకున్నారు. పూర్వీకుల నుంచి అబ్బిన తోలు బొమ్మలాట ప్రదర్శన కళను చిదంబర రావు కొనసాగిస్తున్నారు. ఆయన కళాభిమానాన్ని గుర్తించి పురస్కారానికి ఎంపిక చేశారు. ఇటీవల బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. ఇప్పటి వరకూ వివిధ రాష్ట్రాల ప్రతినిధుల నుంచి 25 అవార్డులు చిదంబరరావు అందుకున్నారు.

ప్రభుత్వానికి కుచ్చుటోపీ



సన్మానం అందుకుంటున్న ఈ వ్యక్తి పేరు తాడాల నాగభూషణం. ఈయన తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘమైన టీఎన్‌టీయూసీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వికలాంగుల కోటా (మానసిక వికలాంగుల)లో ప్రతినెలా ప్రభుత్వ పింఛన్ తీసుకుంటున్నారు. కానీ ఈయన కార్మిక సంఘం నేతగా నిత్యం సమావేశాల్లో దిశానిర్దేశాలు చేస్తూనే ఉన్నారు.

- మానసిక వికలాంగుల కోటాలో పింఛన్
- లబ్ధిదారుడు కార్మిక సంఘం నాయకుడు
- తరచూ సమావేశాలతో దిశానిర్దేశం
- నిజంగానే మానసిక వికలత్వం ఉందా?

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేటకు చెందిన తాడాల నాగభూషణం వృత్తిరీత్యా నాలుగు చక్రాల వాహనం మెకానిక్. ఆరేళ్ల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు గాయాలయ్యాయి. అధికార టీడీపీ నేతలతో పైరవీలు చేయించుకుని వైద్యుల నుంచి 48 శాతంతో మానసిక వికలాంగ సర్టిఫికెట్ పొందారు. దీన్ని ఆసరా చేసుకుని పింఛన్ తీసుకుంటున్నారు. ఇప్పటిదాకా రూ.2.50 లక్షల దాకా పింఛన్ సొమ్ము అంది ఉంటుందని తెలుస్తోంది. మరో వైపు ఎంచక్కా మెకానిక్ పని చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఈ మానసిక వికలాంగుడే గతంలో రాప్తాడు ఆటోనగర్ ప్రెసిడెంట్‌గానూ పని చేశారు. ప్రస్తుతం టీఎన్‌టీయూసీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడి హోదాలో సమావేశాలు ఏర్పాటు చేసి కార్మికుల కోసం పోరాటమంటూ ప్రసంగిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

నాగభూషణం వ్యవహారంపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. అయినా సచివాలయ అధికారులు కానీ, ఎంపీడీఓ కానీ పట్టించుకోలేదు. 48 శాతం మానసిక వైకల్యం కలిగిన వ్యక్తి సాధారణ వ్యక్తిలా ఎలా ఉంటాడని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నాగభూషణం వికలత్వ సర్టిఫికెట్, ఫిజికల్‌గా వైద్యాధికారులతో పరీక్ష చేయిస్తే అసలు విషయం బయటపడుతుందని అంటున్నారు. అనర్హుడికి ఇవ్వడంతో తమ కోటాలో ఒక పింఛన్ తగ్గిపోయిందని వికలాంగులు వాపోతున్నారు.

నేటి నుంచి ధర్మవరం-మచిలీపట్నం రైళ్ల మళ్లింపు

అనంతపురం సిటీ: ధర్మవరం-మచిలీపట్నం-ధర్మవరం మధ్య తిరిగే రైళ్ల (17215/17216)ను మరో మార్గంలో మళ్లించారు. ఈ మేరకు అనంతపురం రైల్వే స్టేషన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ముజావర్ ఫజల్ అహమ్మద్ మంగళవారం తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో మచిలీపట్నం నుంచి ధర్మవరం చేరుకునే రైలు, అలాగే ఈ నెల 3, 4, 5 తేదీల్లో ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్లే రైలును కదిరి, మదనపల్లి, రేణిగుంట మీదుగా మళ్లించినట్లు వివరించారు. గూడూరు డివిజన్‌లోని విజయవాడ వద్ద డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో మూడు రోజుల పాటు ఈ రైళ్ల రాకపోకలు అనంతపురం, గుత్తి, యర్రగుంట్ల మీదుగా ఉండబోవని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని గమనించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ప్రయాణికులకు సూచించారు.

ప్రజల చెంతకే వైద్యం



గ్రామీణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

లేపాక్షి: ప్రజల చెంతకే డాక్టర్లను తీసుకొచ్చి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ క్రిష్టారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చోళసముద్రంలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష-2' వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణులకు ఉచితంగా 7 రకాల వైద్య పరీక్షలు చేస్తారన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శిబిరంలో వైద్యులు 126 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నందిని, ఎంపీడీఓ నరసింహనాయుడు, తహసీల్దార్ బాబు, మెడికల్ ఆఫీసర్ వెంకటచిరంజీవి, వైద్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.